క్లుప్తంగా

జాతీయ విలు విద్య చాంపియన్ యుక్తశ్రీకి అభినందన



యుక్తశ్రీని అభినందిస్తున్న సీఎం ప్రోగ్రాం కోర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు: 40వ సబ్ జూనియర్ జాతీయ విల్లు విద్య చాంపియన్ షిప్ పోటీల్లో రెండు బంగారు, రజత పతకాలు సాధించిన కొండ పావులూరి యుక్తశ్రీ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం అన్నారు. ఎమ్మెల్సీ రఘురామ్ దెందులూరు వచ్చిన సందర్భంగా యుక్తశ్రీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరితో కలిసి మర్యాదపూర్వకంగా కలిసింది. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ విలు విద్యలో రాణించేందుకు, విద్యాభివృద్ధిలో ఎటువంటి సహాయం కావాలన్నా అందిస్తానని అన్నారు.

చురుగ్గా కుల గణన సర్వే



భీమడోలులో కుల గణన సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంఈవో ఈ.శ్రీనివాసరావు

భీమడోలు: మండలంలో కుల గణన సర్వే చివరి దశకు చేరుకుంది. ప్రభుత్వం కుల గణనలోని సామాజిక, ఆర్థిక అంశాలపై ఆదివారంతో సర్వే పూర్తి చేయాలని ఆదేశించింది. రాష్ట్ర చరిత్రలోనే మునుపెన్నడూ లేని విధంగా కుల గణన సర్వే చేసి సామాజిక విప్లవానికి ప్రభుత్వానికి నాంది పలికింది. మండల వ్యాప్తంగా 89.03 శాతం సర్వే పూర్తయ్యింది. ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 5వ తేదీ నాటికి సచివాలయాలకు వెళ్లి కుల గణన చేయించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. మండల వ్యాప్తంగా 23,030 కుటుంబాల్లో 62,957 మంది ఉండగా ఇప్పటి వరకు 89.03 శాతం సర్వే పూర్తయ్యింది. మిగిలిన 10 శాతం సర్వే త్వరితగతిన పూర్తి చేస్తామని ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి తెలిపారు. ఇంటింటికీ వెళ్లి సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు కుటుంబ సభ్యుల నుంచి వివరాలు అడిగి నమోదు చేసారు. సర్వే ప్రక్రియను సంబంధిత అధికారులు పరిశీలిస్తున్నారు.

పేకాట స్థావరంపై దాడి

పెదపాడు: పేకాట ఆడుతున్న ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు పెదపాడు పోలీసులు తెలిపారు. అప్పనవీడులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో పెదపాడు ఎస్సై తన సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడి చేసారు. పేకాట ఆడుతున్న జూదరుల నుంచి రూ.1,060 స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు పెదపాడు ఎస్సై కే శుభశేఖర్ తెలిపారు.

హెడ్ కానిస్టేబుల్ రమేష్‌కు అభినందనలు



దెందులూరు హెడ్ కానిస్టేబుల్ బసవ రమేష్‌కు డీజీపీ కమాండేషన్ డిస్క్ అవార్డు ప్రదానం (ఫైల్)

దెందులూరు: దెందులూరుకు చెందిన హెడ్‌కానిస్టేబుల్ బసవ రమేష్‌కు పోలీస్ శాఖలో ప్రతిష్టాకరమైన డీజీపీ కమాండేషన్ డిస్క్ అవార్డు ఏలూరులో నిర్వహించిన గణతంత్ర వేడుకలలో అందుకున్నారు. ఈ సందర్భంగా దెందులూరు ఎస్సై కే.స్వామి, సిబ్బంది రమేష్‌ను అభినందించారు. భీమడోలు సీరియల్ మర్డర్ కేసులను అత్యంత చాకచాక్యంగా చేధించినందుకు, విధి నిర్వహణలో ఆయన సేవలను గుర్తించిన జిల్లా అధికారులు డీజీపీ ఈ అవార్డును సిఫార్సు చేశారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో హెడ్‌కానిస్టేబుల్ బసవ రమేష్‌కు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, ఎస్పీ డీ.మేరి ప్రశాంతి తదితరులు రమేష్‌కు ప్రశంసాపత్రం, మెడల్, అవార్డు అందజేశారు.

ఢిల్లీ పరేడ్‌లో దెందులూరు వాసి యోగాసనాలు



జ్ఞాపిక అందుకుంటున్న కొత్తపల్లి వినోద్ కుమార్

దెందులూరు: భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఢిల్లీలో నిర్వహించి పరేడ్‌లో యోగాసనాలు ప్రదర్శించిన దెందులూరు వాసి కొత్తపల్లి వినోద్‌కుమార్‌కు షీల్డ్, సర్టిఫికెట్‌తో కేంద్ర బృందం సత్కరించింది. ఆయుష్ ఆర్‌డీడీ కే. వెంకటకృష్ణ, కేంద్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సాధిక్ ఖాన్ కేంద్ర బృందంతో కలిసి వినోద్‌కుమార్‌కు షీల్డ్‌ను, ప్రశంసాపత్రాన్ని అందించి అభినందించారు.

సీఎం సభను విజయవంతం చేయాలి



వైఎస్సార్ సీపీ శ్రేణుల విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి



హాజరైన నాయకులు, కార్యకర్తలు

- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పిలుపు
- దెందులూరులో వైఎస్సార్ సీపీ శ్రేణుల విస్తృతస్థాయి సమావేశం

దెందులూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 3న సహారా గ్రౌండ్స్‌లో ఉమ్మడి పశ్చిమగోదావరి, ఉమ్మడి తూర్పుగోదావరి, కృష్ణా జిల్లాల వైఎస్సార్ సీపీ ఎన్నికల సన్నాహక సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పిలుపునిచ్చారు. ఆదివారం సహారా గ్రౌండ్స్‌లో నిర్వహించిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ దెందులూరు నియోజకవర్గానికి సీఎం మరోసారి రావడం నియోజకవర్గం అదృష్టమన్నారు. దేశంలో ఎక్కడా జరగని విధంగా విద్యా, వైద్యం, ఇళ్ల స్థలాల పంపిణీ, పెన్షన్స్ దేశానికే తలమానికమన్నారు. రూ.3.50 లక్షల కోట్లు నగదును వివిధ పథకాల రూపంలో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు కుల, మత, వర్గాల, ప్రాంతాలకు అతీతంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసి సమసమాజ స్థాపనకు బాటలు వేశారన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలతో పాటు అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు పకడ్బందీగా అమలు చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో వైనాట్ 175 లక్ష్య సాధనకు పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. వచ్చే నెల 3న నిర్వహించనున్న భారీ బహిరంగ సభను కనివినీ ఎరుగని రీతిలో విజయవంతం చేయాలని ఆయన కోరారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు మాట్లాడుతూ దెందులూరు నియోజకవర్గానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండవసారి స్వల్పకాలిక వ్యవధిలో రావడం, ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ప్రణాళిక, పనితీరు, పార్టీ అభివృద్ధికి నిదర్శనమన్నారు. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, వైఎస్సార్ సీపీ ప్రతిష్ట మరింత పెరిగేలా నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేసి సీఎం భారీ బహిరంగసభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, వైస్ చైర్మన్ కాటి సుధాకర్, వడ్డీల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ముంగర సంజీవ్‌కుమార్, విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు తొత్తడి వేదకుమారి, పెదవేగి, ఏలూరు మండలం, దెందులూరు మండలాల పార్టీ అధ్యక్షులు జానంపేట బాబు, తేరా ఆనంద్, కామిరెడ్డి నాని, ఎంపీపీలు పెన్మెత్స శ్రీనివాసరాజు, తాతా రమ్యశ్రీ, బొమ్మనబోయిన సుమలత, బత్తుల రత్నకుమారి, జడ్పీటీసీలు మండలి సరస్వతి, నిట్టా లీలానవకాంతం గంగరాజు, హస్తకళల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఎం. సూర్యనారాయణ, పీవీ రావు, ఆళ్ళ సతీష్ చౌదరి, మేకా లక్ష్మణరావు, నియోజకవర్గంలో సర్పంచులు, సొసైటీ చైర్మన్లు, గ్రామ, మండల, నియోజకవర్గ విభాగాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు, సొసైటీ చైర్మన్లు పాల్గొన్నారు.



సీఎం సభలో ఏర్పాట్లకు సిద్ధమైన హోర్డింగులు

నేడు భీమడోలులో రాట్నాలమ్మకు పూజలు

భీమడోలు: భీమడోలు జంక్షన్‌లో వేంచేసియున్న వేంకటేశ్వర స్వామి రూపక ఆలయ ప్రాంగణం వద్ద ఈనెల 29వ తేదీ సోమవారం సాయంత్రం రాట్నాలమ్మ తల్లికి కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల కొంగుబంగారమైన రాట్నాలమ్మ అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక వాహనంలో తీసుకుని వచ్చి ఇక్కడ కైంకర్య పూజలు చేస్తారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ అభివృద్ధి కమిటీ నిర్వాహకులు సుతాపల్లి ప్రసాద్ కోరారు.

రాట్నాలమ్మకు భక్తిశ్రద్ధలతో పూజలు

పెదవేగి : రాట్నాలమ్మవారికి ఆదివారం వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పెదవేగి మండలం రాట్నాలకుంటలోని అమ్మవారికి జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి పొంగళ్లు వండుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించి, పూజలు చేశారు. ఈ వారం అమ్మవారికి పూజా టికెట్ల విక్రయం ద్వారా రూ. 50,875, విరాళాలు రూ.29,187, లడ్డూ ప్రసాదం విక్రయంతో రూ.15,000, ఫొటోల విక్రయంతో రూ.3,685, మొత్తం రూ.98,747 ఆదాయం లభించిందని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్ సతీష్‌కుమార్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గణపవరం: గణపవరం మండలం వరదరాజపురం విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా ఈనెల 29వ తేదీ సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఆ శాఖ డీఈ తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ గణపవరం కేవీపీ కల్యాణ మండపం ఏరియాలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఆయన తెలిపారు.

గ్యాస్ట్రిక్ సమస్యలపై నిర్లక్ష్యం తగదు



సదస్సులో మాట్లాడుతున్న వైద్య నిపుణుడు గజపతిరాజు

గణపవరం: గ్యాస్ట్రిక్ సమస్యలపై నిర్లక్ష్యం చూపకుండా సకాలంలో వైద్యం తీసుకోవాలని ప్రముఖ గ్యాస్ట్రో సర్జన్ జి.గజపతిరాజు అన్నారు. ఆదివారం గణపవరం లయన్స్ క్లబ్ భవనంలో గణపవరం ఏరియా పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్యాస్ట్రిక్ సమస్యలు, నివారణ అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ జంక్ ఫుడ్స్, నిద్రలేమి, ధూమపానం, మద్యపానం, నిర్ణీత సమయాల్లో ఆహారం తినకపోవడం, ఒత్తిడి, మానసిక ఆందోళన తదితర కారణాల వల్లనే ఎక్కువగా గ్యాస్ట్రిక్ సమస్యలు ఏర్పడతాయన్నారు. దీనివల్ల వచ్చే ఆరోగ్య పరమైన ఇబ్బందులవల్ల మానసిక ప్రశాంతత లోపిస్తుందని అన్నారు. ఎక్కువ గ్యాస్ సమస్యల వల్ల పేగులో పుండ్లు పడటం వల్ల సర్జరీ అవసరమవుతుందన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ మితమైన సాత్వికాహారం తీసుకోవాలని, ఖచ్చితమైన సమయపాలన పాటించాలని, సరిపడ నిద్ర ఉండాలని ఇతర దురలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురికి గ్యాస్ సంబంధిత పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. ఈకార్యక్రమంలో గణపవరం, నిమ్మరు మండలాల పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ మూర్తి, చినిమిల్లి నర్సింహమూర్తి, జిల్లా పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరమేశ్వర్లు మాట్లాడుతూ ఫిబ్రవరి 4న విజయవాడలో నిర్వహించనున్న క్యాన్సర్ అవగాహన ప్రదర్శనలో జిల్లాలోని పీఎంపీలంతా పాల్గొనాలని పిలుపు ఇచ్చారు.

పేదలకు ఆదుకోవడమే మానవత లక్ష్యం



పోలసానిపల్లిలో ఆర్థిక సాయం అందిస్తున్న జిల్లా అధ్యక్షుడు అప్పక రాంబాబు తదితరులు

భీమడోలు: నిరుపేదలను ఆదుకోవడమే మానవత స్వచ్ఛంద సంస్థ లక్ష్యమని జిల్లా శాంతి రథాల విభాగం అధ్యక్షుడు అప్పక రాంబాబు అన్నారు. పోలసానిపల్లి-1 ప్రాథమిక పాఠశాలలో ఆదివారం మండల స్థాయి మానవత శాఖ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో నిర్వహించాల్సిన సామాజిక సేవా కార్యక్రమాలను చర్చించి పలు అంశాలపై తీర్మానించారు. వివిధ గ్రామాల్లో 8 కుటుంబాలకు సహకారం అందించాలని, ఇద్దరు ప్రతిభా పురస్కారం కింద విద్యా నిధి నుంచి రూ.25వేల చొప్పున ఆర్థిక సాయం అందించాలని తీర్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మండల చైర్మన్ గుల్ల నూకరాజు అధ్యక్షత వహించారు. ప్రతిభ గల పేద విద్యార్థిని వ్యవసాయ పాలిటెక్నిక్ చదువుతున్న డోకల హేమ దుర్గసాయికి రూ.15వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోర్డినేటర్ రామిశెట్టి గంగాధరరావు, కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వరరావు, జాయింట్ కార్యదర్శి అల్లాడ ప్రసాదరావు, జిల్లా ఆడిటింగ్ కన్వీనర్ గోనుగుంట రమణ శంకర్, ప్రతినిధులు పచ్చా వెంకటేశ్వర రావు, చిలపర్తి రామారాయుడు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి పరామర్శ

దెందులూరు: అనారోగ్యంతో బాధపడుతున్న జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతాన్ని ఆదివారం ఆమె నివాసంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని పరామర్శించారు. వైద్యంతోపాటు విశ్రాంతి తీసుకుని త్వరిగతిన కోలుకోవాలని జెడ్పీటీసీకి ఎమ్మెల్యే సూచించారు. మండల ఎస్సీ సెల్ నాయకులు నిట్టా గంగరాజు, జోగన్నపాలెం వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నిట్టా గాంధీ, సొసైటీ చైర్మన్ పాకలపాటి శ్రీనివాసరావు ఉన్నారు.

ఉంద్రాజవరంలో పరామర్శ

ఎంపీటీసీ సున్నా నరేష్ కుటుంబం, ఉంద్రాజవరం గ్రామ మొత్తం తమకు ప్రత్యేకమని, నరేష్ తండ్రి శ్రీనివాసరావు ఆకస్మిక మరణం తనను కలిచి వేసిందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. ఆదివారం ఉంద్రాజవరంలో ఎంపీటీసీ నరేష్ కుటుంబాన్ని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీటీసీ కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో పోతునూరు సర్పంచ్ బోదుల స్వరూప్, వైఎస్సార్ సీపీ నాయకులు తలారి రామకృష్ణ, సున్నా ఫణీ, సున్నా సుధీర్, వాసే డొమినిక్, రవి, బుద్ధా అర్జున, రమేష్, దెందులూరు మండలంలో నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

- మొండూరులో అనారోగ్యంతో బాధపడుతున్న తాడికొండ భాగ్యలక్ష్మి, సొసైటీ డైరెక్టర్ కొలుకులూరి నాగేశ్వరరావు సతీమణిని వారి ఇళ్లకు వెళ్లి ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి పరామర్శించారు. వారి వెంట పెదవేగి మండల అధ్యక్షుడు జానంపేట బాబు, ఎంపీపీ తాతా రమ్యశ్రీ, జెడ్పీ వైస్ చైర్మన్ పీ.విజయ్‌బాబు, నాయకులు తాతా సత్యనారాయణ, బొద్దు సతీష్, తదితరులున్నారు.

జల్లికొమ్మరలో జాతర కోలాహలం



జల్లికొమ్మర గోగులమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

గణపవరం: గణపవరం మండలం జల్లికొమ్మర గ్రామ ప్రజల ఆరాధ్య దైవం, గ్రామ దేవత గోగులమ్మవారి జాతర మహోత్సవాలు ముగింపు సందర్భంగా ఆదివారం అమ్మవారికి నైవేద్యాల సమర్పణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. అల్లుళ్లు ఆడపడుచులు, బంధుమిత్రుల రాకతో గ్రామం జనంతో కిటకిట లాడింది. ప్రతి ఇల్లు బంధుమిత్రులతో కళకళలాడింది. గ్రామానికి వెళ్లే రోడ్లన్నీ ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లతో నిండిపోవడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. ఆదివారం ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు సోదరులు చిన బాబు, కన్నబాబు, ఎంపీపీ అర్ధవరం రాము, జెడ్పీటీసీ సభ్యురాలు దేవారపు సోమలక్ష్మి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దండు రాము, పార్టీ ప్రముఖులు కాకర్ల శ్రీను, వివిధ పార్టీల నియోజకవర్గ నాయకులు, సర్పంచ్‌లు తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఉదయం 5 గంటలకు అమ్మవారికి సేవ నిర్వహించి, పూజల అనంతరం నైవేద్యాల సమర్పణ కార్యక్రమం ప్రారంభించారు. ఆలయం వద్ద పంబరులతో అమ్మవారి కథలు చెప్పించారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సొంతింటి కల సాకారం

- పేదలకు పక్కా ఇళ్లు
- ఏలూరు రూరల్ మండలంలో చురుగ్గా నిర్మాణాలు
- లబ్ధిదారులకు రూ.12,77,81,000 అందజేత
- 1,088 గృహ నిర్మాణాలు పూర్తి



జాలిపూడిలో నిర్మిస్తున్న గృహాలు

ఏలూరు రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పేదల సొంతిల్లు కల సాకార మవుతోంది. రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేదలు ఎందరో సొంతిల్లు నిర్మించుకుని సంతోషంగా జీవిస్తున్నారు. దీనికి కారణం పేదల ఇళ్ల నిర్మాణంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి ప్రోత్సహించడమే. గతంలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హౌసింగ్ శాఖకు కోట్ల రూపాయలు నిధులు విడుదల చేస్తున్నారు. 2023 నవంబర్ నెలాఖరు నాటికి ఏలూరు రూరల్ మండలం పరిధిలోని గ్రామాల్లో 1,088 మంది సొంతిల్లు నిర్మించుకున్నారు. వీరికి ప్రభుత్వం రూ.12,77,81,000 అందజేసింది. మరోపక్క 11 జగనన్న కాలనీల్లో రోడ్లు అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం రూ.1.40 కోట్లు మంజూరు చేసిందని హౌసింగ్ ఏఈ లక్ష్మణ వెల్లడించారు. ఈ మొత్తం నిధులతో త్వరలో గ్రావెల్ రోడ్లు పనులు ప్రారంభించనున్నామని వివరించారు. దీనికి తోడు కాలనీలకు వెళ్లే దారిలో అడ్డంగా ఉన్న పంట కాలువ, మురుగుదారుల గుండా కల్వర్టులు, వంతెనలు నిర్మించనున్నామని వివరించారు.

గృహ నిర్మాణానికి గ్రామాల వారీగా కేటాయించిన నిధులు

చాటపర్రుకు రూ. 2,96,35,873, పైడిచింతపాడుకు రూ.81,96,482. ప్రత్తికోళ్లలంకకు రూ.1,25,93,456. కేడీపురంలో రూ.3,28,1459. కోమటిలంకకు రూ.26,12,393. శ్రీపర్రుకు రూ.1,09,08278. పెదయాగనమిల్లికి రూ.1,50,0000. గుడివాకలంకకు రూ.6,54,6651. జాలిపూడికి రూ. 2,02,21,461. మల్కాపురానికి రూ.1,91,57,344. మాదేపల్లికి రూ.1,31,28,091 ప్రభుత్వం అందజేసింది.

నాలుగు దశల్లో నగదు మంజూరు

ఇంటి నిర్మాణం చేపట్టిన పేదలకు అధికారులు క్రమం తప్పకుండా నిధులు మంజూరు చేస్తున్నారు. లబ్ధిదారులు ఇబ్బందులు పడకుండా కాలనీల వద్దకే ఇసుక, సిమెంట్, ఐరన్ అందుబాటులో ఉంచుతున్నారు. పనులు ప్రారంభం కాగానే బేస్‌మెంట్ లెవెల్‌లో రూ.70,000, రూఫ్ లెవెల్‌లో రూ.37,600, రూఫ్ కాస్ట్ రూ.21,200, చివరి దశలో రూ.21,200 లబ్ధిదారులు ఖాతాల్లో జమ చేస్తున్నారు. దీనికి తోడు ఉపాధి హామీ పథకం ద్వారా 90రోజుల వేతనం రూ.30,000 అందిస్తున్నారు. దీనికితోడు మరో రూ.30వేలు లబ్ధిదారులకు డ్వాక్రా సంఘాలనుంచి అప్పుగా అందజేస్తున్నారు.

అధికారులు ప్రత్యేక శ్రద్ధ

ఇళ్ల నిర్మాణంపై హౌసింగ్ అధికారులతో పాటు మండల పరిషత్, ఇంజినీరింగ్ శాఖాధికారులతో పాటు సచివాలయ సిబ్బంది సైతం ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. లబ్ధిదారులను వ్యక్తిగతంగా కలుసుకుని వారికి అవసరమైన రోడ్లు, నీటి వసతి తదితర మౌలిక వసతులు కల్పిస్తున్నారు.


ఉత్సాహంగా ఇళ్ల నిర్మాణం



మా గ్రామంలో ఇళ్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. లబ్ధిదారులు ఎంతో ఉత్సాహంగా ఇళ్లు నిర్మించుకుంటున్నారు. లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు ప్రభుత్వం నిధులు వారి ఖాతాల్లో జమ చేస్తోంది. కొత్త వారికి సైతం అధికారులు పట్టాలు మంజూరు చేశారు. ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ సరఫరాకు కనెక్షన్లు ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి సహకారంతో మా గ్రామంలో పేదలకు సొంతిల్లు ఏర్పాటవున్నందుకు సంతోషంగా ఉంది.

– ముంగర తిమోతీ, పైడిచింతపాడు సర్పంచ్

మౌలిక వసతులు కల్పించాం



కొల్లేరు గ్రామాల్లో పేదలు ఇళ్లు నిర్మించుకోవాలంటే ఎంతో వ్యయం అవుతుంది. భూమి బురదమయం కావడం వల్ల ముందుగా మెరక చేసుకోవాలి. ఈ సమస్యను గుర్తించి ప్రభుత్వం కోట్ల రూపాయలు ఎంఎన్ఆర్ఈజీఎస్ నిధులు మంజూరు చేయడంతో జగనన్న కాలనీలకు కేటాయించిన స్థలాలను మెరక చేశాం. దీనివల్ల లబ్ధిదారులకు భవిష్యత్తులో ఎలాంటి ముంపు సమస్య ఉండదు. కాలనీల్లో బోర్లు, విద్యుత్ ఏర్పాటు చేసాం. రానున్న రోజుల్లో గ్రావెల్ రోడ్లు నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– జి. శ్రీనివాసరావు, తహసీల్దార్



జాలిపూడి కాలనీలో నిర్మించిన ఇల్లు



చాటపర్రులో ఇళ్ల నిర్మాణం పరిశీలిస్తున్న ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు

లజపతిరాయ్ సేవలు చిరస్మరణీయం



భీమడోలులో లజపతిరాయ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మండే సుధాకర్, చిన్నారులు

భీమడోలు: పంజాబ్ కేసరి, భారత స్వాతంత్ర్య సమర యోధుడు లాల లజపతిరాయ్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అన్నారు. మండలంలోని భీమడోలు, గుండుగొలను, పూళ్ల శాఖా గ్రంథాలయాల్లో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో లాల లజపతిరాయ్ 159వ జయంత్రి కార్యక్రమం నిర్వహించారు. లజపతిరాయ్ చిత్రపటానికి ఆయన మాలలు వేసి ఘన నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. గ్రంథపాలకులు డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలకృష్ణ కిషోర్ శర్మకు వరాహమిహిర పురస్కారం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని నరసింహారావు పేటకు చెందిన జ్యోతిష్య సమృతి అవధాని గుడిమెట్ల బాలకృష్ణ కిషోర్ శర్మకు జ్యోతిష శాస్త్ర వరాహమిహిర పురస్కారం లభించింది. విశ్వజ్యోతి విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ హబ్సిగూడలోని కిన్నెర గ్రాండ్‌లో నిర్వహించిన జ్యోతిష్య వైదిక సమ్మేళనంలో బాలకృష్ణ కిషోర్ శర్మ పాల్గొని సమాజానికి జ్యోతిష్య శాస్త్రం ఆవశ్యకత, ప్రస్తుత పరిస్థితిలో జ్యోతిష్య శాస్త్ర మనుగడ తదితర అంశాలపై ప్రసంగించారు. శర్మ జ్యోతిష్య శాస్త్రంలో 4 సార్లు జాతీయ స్థాయి అవార్డులు, అంతర్జాతీయ జ్యోతిష్య శాస్త్రవేత్త అవార్డు పొందారు. శాస్త్ర అభివృద్ధికి కృషి చేస్తున్న శర్మకు విశ్వజ్యోతి విజ్ఞాన సంస్థ జ్యోతిష్య శాస్త్ర వరాహ మిహిర పురస్కారాన్ని యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం ప్రధానార్చకుడు నల్లంతిఘల్ లక్ష్మీ నరసింహాచార్యులు చేతుల మీదుగా ప్రదానం చేశారు.